

ఓటరు స్లిప్పుల పంపిణీ

కులకచర్ల, ఏప్రిల్ 25: కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని గ్రామాల్లో గురువారం బీఎల్‌వోలు ఇంటింటికి తిరిగి ఓటర్లకు స్లిప్పులనుపంపిణీ చేశారు. ఆయా మండలాల తహసీల్దార్‌లు మురళీధర్, ప్రభు మాట్లాడుతూ ఓటర్లందరికీ మే 6 వరకు ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని తెలిపారు. 13 రకాల్లో ఏదైనా గుర్తింపు కార్డు తీసుకొచ్చి పోలింగ్ రోజు నిర్భయంగా ఓటు వేయాలని తెలిపారు. మండల పరిధిలో అన్ని గ్రామాల్లో ఓటర్ల స్లిప్పుల పంపిణీ జరుగుతుందని తెలిపారు.

కొనేదెప్పుడు?



మెంట్లకుంటలోని కేంద్రం ఆవరణలో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు

యాసంగి ధాన్యం కొనుగోళ్లలో అధికారుల తీరు ఆరంభ శూరత్వంగా కనిపిస్తోంది. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తున్నా నిర్వాహకులు ఇంకా కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో రైతులు తెచ్చిన ధాన్యం నిల్వలు కేంద్రాల ఆవరణలో పేరుకుపోతున్నాయి. అకాల వర్షాలు కురిస్తే విక్రయించేందుకు ధాన్యం ఎక్కడ తడిసిపోతుందేమోనన్న ఆందోళన అన్నదాతలను పట్టిపీడిస్తోంది. ధాన్యం సేకరణకు చర్యలు తీసుకుంటున్నామని సర్కారు ప్రకటించినా.. సీఎం రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లాలో కిలో ధాన్యం కూడా కొనుగోలు చేయలేదు. చేతికొచ్చిన పంటను అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ఫలితం శూన్యం

- జిల్లాలో 122 కేంద్రాల ఏర్పాటు... కిలో ధాన్యం కొనుగోలు చేయని వైనం
- రైతులు ధాన్యం తెస్తున్నా పట్టించుకోని యంత్రాంగం
- కేంద్రాల ఆవరణలో ధాన్యం నిల్వలు.. కొనుగోళ్ల కోసం రైతుల ఎదురుచూపులు
- కలెక్టర్, అదనపు కలెక్టర్ సమీక్షలు నిర్వహిస్తున్నా చలనం లేని పౌరసరఫరాల శాఖ
- కేంద్రాల్లో గన్నీ బస్తాల కొరత.. పీపీసీలకు ఇంకా చేరని ఐరిష్ కిట్లు
- వానొస్తే.. ధాన్యం వర్షార్పణమే

పరిగి, ఏప్రిల్ 25 : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నీ ప్రారంభించామని చెబుతున్న అధికారులు .. వడ్ల కొనుగోలుకు చర్యలు తీసుకోవడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కొనుగోళ్ల ప్రారంభం కాకపోడంతో రైతులు తమ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో విక్రయిస్తూ నష్టపోతున్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వీలుగా కేంద్రాలు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని రాష్ట్ర ప్రభుత్వం మాటలకు చేతలకు పొంతన లేకుండా పోయింది. సీఎం రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లాలో మాత్రం ఇంకా ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కాకపోవడం గమనార్హం. జిల్లాలో రెండు వారాలుగా యాసంగి ధాన్యం మార్కెట్లోకి వస్తోంది. రైతులు పండించిన ధాన్యాన్ని సేకరించేందుకు పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా కొనుగోళ్ల విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. తొలిదశకోత పూర్తి చేసిన రైతులు పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలకు తీసుకువెళుతున్నా.. అక్కడ కొనుగోళ్లు ఇంకా ప్రారంభించకపోవడంతో అత్యవసరమైన రైతులు బహిరంగ మార్కెట్లకు తీసుకు వెళ్లి వ్యాపారులు నిర్ణయించిన ధరలకు విక్రయిస్తూ నిలువునా మోసపోతున్నారు

1.19 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

గత ఏడాది మాదిరిగానే ఈసారి యాసంగి ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లాలో 129 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం 122 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు స్వయంగా అధికారులే చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకు ఎక్కడా ధాన్యం సేకరణ ప్రారంభించలేదు. ఈ సీజన్‌లో 1.96 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చే అవకాశం ఉండగా, దీంట్లో 1.19 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్న లక్ష్యం అధికారులు నిర్దేశించుకున్నారు. ధాన్యం కొనుగోళ్లపై కేంద్రాల నిర్వాహకులకు ఓపీఎంఎస్‌పై ఈనెల మొదటి వారంలో శిక్షణ ఇచ్చారు. జిల్లాలో 90 శాతం వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను హడావిడిగా ప్రారంభించి రెండు వారాలు గడిచినా ఇంత వరకూ ఒక్క కేంద్రంలో కూడా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. గత ఏడాది ఈ సీజన్‌లో ఇదే సమయానికి కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకుని రైతుల ఖాతాల్లో చెల్లింపులు కూడా జరిగాయి. ఈసారి జిల్లాలో ఇంకా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

తూకాలు వేయని వైనం

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడానికి ముందు ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు అవేమీ లేకుండానే కేంద్రాలు ప్రారంభించినట్లు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తే స్పష్టమవుతోంది. రైతులు ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళుతున్నా.. అక్కడ నిర్వాహకులు తూకాలు చేయకపోవడంతో రైతులు తాము తెచ్చిన ధాన్యాన్ని అక్కడే నిల్వ చేస్తున్నారు. దీంతో ధాన్యం నిల్వలు రోజురోజుకూ పేరుకుపోతున్నాయి. ధాన్యం కొనుగోళ్ల విషయంలో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌లు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నా పౌరసరఫరాల శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం గమనార్హం.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు నిల్

కేంద్రాల్లో కొనుగోళ్ల విషయం అటుంచితే ధాన్యం తీసుకు వచ్చే రైతులకు కనీస వసతులు కూడా కల్పించకపోవడం గమనార్హం. వాస్తవానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలు నిల్వ చేసేందుకు వీలుగా గోదాములు ఉండాలి. అయితే జిల్లాలో ఎక్కడా ఈ సదుపాయం లేదు. తూకం మిషన్లు, టార్పాలిన్ షీట్లు, గన్నీ బస్తాలు, తేమ గుర్తించే మీటర్లు, ప్యాడీ క్లీనర్లు, లైటింగ్, తాగునీరు, రైతులకు వసతి వంటి సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. ఈసారి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ఐరిస్ ద్వారా చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటి వరకూ ఐరిస్ కిట్లు ఇంకా కొనుగోలు కేంద్రాలకు సరఫరా కాకపోవడం గమనార్హం. గన్నీ బస్తాలు లేకుండా, ఐరిష్ కిట్లు సరఫరా చేయకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఏ విధంగా ముందుకు సాగుతుందనేది సంబంధిత అధికారులే సెలవివ్వాలి. ఓపీఎంఎస్ సాఫ్ట్‌వేర్ కూడా ఇన్‌స్టాల్ చేయలేదని తెలిసింది.

వానొస్తే.. వర్షార్పణమే

వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో ఈదురు గాలులు, అకాల వర్షం కురిస్తే మాత్రం కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చిన ధాన్యం తడిసిపోయే ప్రమాదం పొంచి ఉంది. ధాన్యం కొనుగోళ్ల అలస్యం కావడంతో రైతులు తాము తెచ్చిన ధాన్యాన్ని కేంద్రాల ఆవరణలో రాశులుగా పోసుకుని కాపలా ఉంటున్నారు. వర్షం కురిస్తే తాము తెచ్చిన పంట తడిసిపోయి తాము నష్టపోతామని, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

చిరిగిన గోనె సంచులు సరఫరా

ధాన్యం కొనుగోళ్లకు ఉపయోగించే గన్నీ బస్తాల విషయంలో సంబంధిత అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో గురువారం వరకు వేళ్ల మీద లెక్కించే కేంద్రాలకు మాత్రమే గన్నీ బస్తాలు పంపించినట్లు తెలుస్తోంది. కొనుగోలు కేంద్రాల ఎదుట ధాన్యం నిల్వలు పెరిగిపోతున్న ఈ సమయంలో కేంద్రాల్లో అవసరమైన మేర గోనె సంచులు అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. గత ఏడాది ధాన్యం కొనుగోళ్ల కోసం గన్నీ బస్తాలకు ఇండెంట్ పెట్టగా, అప్పట్లో వచ్చిన 15లక్షల గన్నీ బస్తాలు పౌరసరఫరాల శాఖ అధికారుల వద్ద అందుబాటులో ఉన్నాయి. తమ వద్ద ఉన్న గన్నీ బస్తాలను కూడా కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేయకపోవడం పట్ల రైతులు మండిపడుతున్నారు. కేంద్రాలకు పంపించిన గన్నీ బస్తాలు కూడా ధాన్యం నిల్వ ఉంచడానికి ఏమాత్రం అనుకూలంగా లేకపోవడం గమనార్హం. గన్నీ బస్తాలకు పెద్దపెద్ద రంధ్రాలు ఉంటే.. ఏ విధంగా ధాన్యం సేకరణ సాధ్యమవుతుందనేది అధికారులకే తెలియాలి. జిల్లాలో అందుబాటులో ఉన్న 15లక్షల గన్నీ బస్తాలు పోనూ ఇంకా 14.25 లక్షల గన్నీ బస్తాలు అవసరం కానున్నాయి.



చిరిగిన గోనె సంచులు సరఫరా



బొంరాస్‌పేట్‌లోని కేంద్రంలో తూకం వేయకపోవడంతో ఆరబోసిన ధాన్యం

వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్న రైతులు

రైతులు పండించే ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. ఈసారి ఏ-గ్రేడ్ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,203, బి-గ్రేడ్ రకానికి రూ.2,183 చెల్లిస్తున్నట్లు ప్రకటించింది. నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకెళ్లినా కేంద్రాల్లో కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో ధాన్యాన్ని రైతులు బహిరంగ మార్కెట్లో విక్రయిస్తూ నష్టపోతున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు సిండికేట్‌గా మారి క్వింటాల్‌కు రూ.300 తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. రూ.1900 నుంచి రూ.2,000 లోపే రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. నష్టపోతున్నామని తెలిసినా కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో వేరే మార్గం లేక విక్రయిస్తున్నామని రైతులు వాపోతున్నారు.




పరిగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ నారాయణరెడ్డి (ఫైల్)

సూర్యప్రతాపం

- మండుటెండలతో బెంబేలు
- ఉక్కిరిబిక్కిరవుతున్న జీవులు
- అత్యధికంగా కోట్‌పల్లిలో 41.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు




వికారాబాద్, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం తొమ్మిది గంటలకే ఎండలు ఉగ్రరూపం దాలుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం ఆరు గంటలకు ముందే ఉదయిస్తున్న సూరీడు భగభగ మండుతున్నాడు. రాత్రి తొమ్మిది గంటలవుతున్నా వేడి తగ్గకపోవడంతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. మండుతున్న ఎండలతో ఉదయం పది గంటలు దాటిన తరువాత ప్రజలు తమ ఇళ్లలో నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. రెండు, మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు మరింత ఎక్కువ నమోదవుతుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఏప్రిల్ నెలలోనే ఎండలు ఈ విధంగా ఉంటే మే నెలలో ఎండలు మరెంత తీవ్రంగా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు. పెరిగిన ఉష్ణోగతలతో ఆరు బయట పనిచేసే వారు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో భవన కార్మికులు, ఉపాధి కూలీలు పనులకు హాజరయ్యేందుకు వెనకాడుతున్నారు. ప్రచండభానుడు ఉగ్రరూపం దాలుస్తుండడంతో వికారాబాద్ జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం జిల్లాలో 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో 29 ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతల్లో 14 చోట్ల 40 డిగ్రీలకు పైగానే నమోదు కావడం గమనార్హం. గురువారం జిల్లాలో కోట్‌పల్లిలో 41.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మోమిన్‌పేట్‌లో 41.7 డిగ్రీలు, బంట్వారం మండలం, నాగారంలో 41.6 డిగ్రీలు, కులకచర్ల మండలం, పుట్టపహడ్, పూడూరు మండలం, మన్నేగూడ, మర్పల్లిల్లో 41.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మర్పల్లిలో 41.5 డిగ్రీలు, బంట్వారంలో 41.5 డిగ్రీలు, దౌల్తాబాద్‌లో 40.9 డిగ్రీలు, వికారాబాద్‌లో 40.8, కులకచర్ల మండలం, ముజాహిద్‌పూర్‌లో 40.6 డిగ్రీలు, పెద్దేముల్‌లో 40.6 డిగ్రీలు, పరిగి మండలం, రాపోల్‌లో 40.2 డిగ్రీలు, ధారూరులో 40.2 డిగ్రీలు, దుద్యాల్‌లో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బషీరాబాద్ మండలం, కాశీంపూర్‌లో 40.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోయ్యాయి. మూడు, నాలుగు రోజులుగా జిల్లాలో సూర్యప్రతాపం చాలా అధికంగా ఉంది. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా బెంబేలెత్తే విధంగా నమోదవుతుండడంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు.



ముగిసిన నామినేషన్ల పర్వం

- మల్కాజ్‌గిరికి చివరి రోజు 61మంది 91 సెట్లు
- మొత్తం 114 మంది 177 సెట్లు దాఖలు
- చేవెళ్లకు చివరి రోజు 31 నామినేషన్లు
- ఇప్పటి వరకూ మొత్తం 66 మంది 87 దాఖలు

ఆంధ్రజ్యోతి, మేడ్చల్/రంగారెడ్డిఅర్బన్, ఏప్రిల్ 25: మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి చివరిరోజు జోరుగా నామినేషన్‌లు దాఖలయ్యాయి. ఈమేరకు గురువారం 61 మంది 91 సెట్లు దాఖలు చేసినట్లు మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించిన నామినేషన్ల స్వీకరణలో భాగంగా మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి మొత్తం 114 మంది అభ్యర్థులకు గాను, 177 సెట్లు దాఖలు చేసినట్లు తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానానికి అన్ని పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 66 మంది అభ్యర్థులు 87 సెట్లు దాఖలు చేశారు.



అనుచరులతో కలిసి ర్యాలీగా తరలివెళ్లి నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి తన నామినేషన్‌ను ఎన్నికల అధికారి శశాంకకు అందజేశారు. అలాగే స్వతంత్ర అభ్యర్థిగా ఈసరి సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా కె.విశ్వేశ్వర్‌రెడ్డి, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా గోపిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బానోత్ వెంకన్న, స్వతంత్ర అభ్యర్థిగా నీరటి ఆంజనేయులు, ప్రజావెలుగు పార్టీ అభ్యర్థిగా టి. దుర్గప్రసాద్, స్వతంత్ర అభ్యర్థిగా మహ్మద్ రియాజుర్ రెహ్మాన్‌షేక్, స్వతంత్ర అభ్యర్థిగా ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ అభ్యర్థి తరపున కాసాని వీరేష్, ఇండియా ప్రజాబంధు పార్టీ అభ్యర్థిగా పాలమాకుల మధు, స్వతంత్ర అభ్యర్థిగా రాచమల్ల రాజేష్, తెలంగాణ రిపబ్లిక్ పార్టీ అభ్యర్థిగా నర్సింహారెడ్డి ద్యాపా, అన్న వైఎస్సార్ పార్టీ అభ్యర్థిగా ఇబ్రహీం ఉల్‌హక్, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా తోట్ల రాఘవేందర్, స్వతంత్ర అభ్యర్థులుగా జి. మల్లేష్‌గౌడ్, కావలి సుకుమార్, దూదేకుల ఇమామ్ హుస్సేన్, జలీల్ అహ్మద్, కొంపల్లి అనంతరెడ్డి, ఎస్కే. సమీర్, శ్రీనివాస్‌రావ్ జాదవ్, సయ్యద్ ఇబ్రహీం, కాత్రవత్ శివాని కాత్రవత్ శ్రావణి, నామినేషన్ వేశారు. అలాగే రాష్ట్రీయ సామాన్య ప్రజాపార్టీ అభ్యర్థిగా వసంత్ కుమార్, బ్లూ ఇండియా పార్టీ అభ్యర్థిగా చింతలగారి వెంకటస్వామి, రెవెల్యూషన్ సొసైటీ పార్టీ అభ్యర్థిగా గాదె రంజిత్‌రెడ్డి, జనతాదళ్ (సెక్యులర్) పార్టీ అభ్యర్థిగా బొమినెల్లి ప్రభాకర్, యుగ తులసి పార్టీ అభ్యర్థిగా బింగి రాములు నామినేషన్ దాఖలు చేశారు. ఇక నేటి నుంచి నామినేషన్ పరిశీలన జరగనుంది. ఈనెల 29 వరకు నామినేషన్ల విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంది.

డొక్కు బస్సులు.. తప్పని అవస్థలు

వికారాబాద్, ఏప్రిల్ 25 : కాలం చెల్లిన డొక్కు బస్సులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ డొక్కు బస్సులను నడపడంతో వికారాబాద్ అనంతగిరి ఘాట్ రోడ్డులో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ ప్రజలు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. గురువారం తాండూరు నుంచి హైదరాబాద్ వస్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఘాట్‌రోడ్డు ఎక్కలేక ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు బస్సు దిగి నడుచుకుంటూ ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా వికారాబాద్, తాండూరు, పరిగి డిపోలకు కొత్త బస్సులను అందించాలని ప్రజలు కోరుతున్నారు.



అనంతగిరి ఘాట్ రోడ్డులో బస్సు ఆగిపోవడంతో నడుస్తున్న ప్రయాణికులు

మోదీ సభకు స్థల పరిశీలన



వికారాబాద్, ఏప్రిల్ 25 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 4న ప్రధాని నరేంద్రమోదీ వికారాబాద్ రానున్నారు. ఇందుకు సంబంధించిన బహిరంగ సభ నిర్వహణకు స్థల పరిశీలన చేస్తున్నారు. ఈక్రమంలో గురువారం ఎస్పీ కోటిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు వికారాబాద్ మునిసిపల్ పరిధి మద్గుల్ చిట్టంపల్లి సమీపంలోని ప్రజా రిసార్ట్స్‌లోని ఖాళీ ప్రదేశాన్ని పరిశీలించారు. 100 ఎకరాలున్న ఈ ప్రాంతంలో బహిరంగ సభ నిర్వహించాలని బీజేపీ నాయకులు భావిస్తున్నారు. ఆప్రదేశాన్ని ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్చించారు.

మలేరియా నివారణే లక్ష్యం

- డీఎంహెచ్‌వో పాల్వన్‌కుమార్

వికారాబాద్, ఏప్రిల్ 25 : 2030 నాటికి మలేరియాను నివారణే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని డీఎంహెచ్‌వో పాల్వన్‌కుమార్ తెలిపారు ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా గురువారం వికారాబాద్ పట్టణంలో డీఎంహెచ్‌వో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కొన్ని సంవత్సరాలుగా ప్రజలలో ఆరోగ్య సంరక్షణ పట్ల అవగాహన పెరిగిందన్నారు. గ్రామాలు, పట్టణాలలో పారిశుధ్య కార్యక్రమాలు మెరుగు పడడంతో మలేరియా కేసుల సంఖ్య గణనీయంగా తగ్గిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో పాల్వన్‌కుమార్

వీరశైవ సమాజం తాలూకా కమిటీ ఎన్నిక

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 25: వీరశైవ సమాజం కొడంగల్ తాలూకా కమిటీని గురువారంనిరంజన మఠంలో ఎన్నుకున్నారు. మఠాధిపతి శాశ్వత గౌరవ అధ్యక్షుడు శ్రీ జగద్గురు సిద్దిలింగ మహాస్వామి, గౌరవ అధ్యక్షుడు ముద్దప్పదేశ్‌ముఖ్ సమక్షంలో అధ్యక్షుడిగా కొప్పూర్ విజయ్‌వర్ధన్, ఉపాధ్యక్షుడిగా బర్ల శ్రీశైలం, సోమయ్య, కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా దౌల్తాబాద్ మల్లేశం, కోషాధికారిగా రాకేశ్, కార్యదర్శులుగా వద్ది శరణయ్య, జాజిం భరత్‌కుమార్, పి.శివశంకర్, ఆవుటి సిద్ధప్ప, న్యాయ సలహాదారుడిగా జాధవరావు, గౌరవ సలహాదారులుగా మల్లికార్జున్, ఆవుటి మల్లేశ్, ఆర్.బస్వరాజ్, సిద్దిలింగప్పలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్

కులకచర్ల, ఏప్రిల్ 25: ధాన్యం కొనుగోళ్లను ప్రక్రియను వేగవంతం చేయాలని వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ తెలిపారు. కులకచర్లలో కొనసాగుతున్న ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. సరైన తేమ శాతం ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని, తాలు లేకుండా శుభ్రం చేసిన వరి ధాన్యాన్ని చూసి కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయ అధికారులు ధృవీకరించిన ధాన్యాన్ని వెంటనే తూకం వేయించి మిల్లులకు తరలించాలని నిర్వాహకులను సూచించారు. వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. అనంతరం కులకచర్లలో పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో వీరస్వామి, కేంద్రం ఇంచార్జ్ వెంకట్, రైతులు పాల్గొన్నారు.

డిప్లమా కోర్సుల్లో అనాథ పిల్లలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, ఏప్రిల్ 25: 2024-25 సంవత్సరానికి దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళ టెక్నికల్ సంస్థ హైదరాబాద్ నందు 3 సంవత్సరాల టెక్నికల్ డిప్లమా కోర్సులకు అనాథ పిల్లలు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. తల్లిదండ్రులు కోల్పోయిన అనాథ బాలికలు, తల్లిని లేదా తండ్రిని కోల్పోయిన బాలికల నుంచి, అక్రమ రవాణాకు సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. ప్రతీ కోర్సులో 60సీట్లకు గానూ మొత్తం 240సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంపికైన బాలికలకు ఉచిత విద్యతో పాటు వసతి సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు. వివరాలకు 9640863896, 9849672296 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు భద్రేశ్వరుడి జాతర సన్నాహక సమావేశం

తాండూరు, ఏప్రిల్ 25: ఈనెల 30 నుంచి ప్రారంభమయ్యే శ్రీభావిగి భద్రేశ్వర స్వామి జాతర ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లపై ఈనెల శుక్రవారం(నేడు) 11గంటలకు సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్డీవో శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి సుదర్శన్

ఎక్కడైనా బాధ్యతాయుతంగా పనిచేస్తా

వికారాబాద్, ఏప్రిల్ 25: తాను ఎక్కడ పనిచేసినా బాధ్యతాయుతంగా పనిచేస్తానని జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.సుదర్శన్ తెలిపారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు నిజాయితీగా నిష్పక్షపాతంగా పనిచేయడం ఇష్టమన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ.. జిల్లా న్యాయమూర్తిగా మంచి సేవలందించారని అన్నారు. న్యాయవాదులను చిన్నాపెద్దా తేడా లేకుండా చూసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, సీనియర్ న్యాయ మూర్తి డీబీ శీతల్, ప్రిన్సిపల్ జూనియర్ న్యాయమూర్తి శ్రీకాంత్, అదనపు జూనియర్ న్యాయమూర్తి శృతిదూత, ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్, న్యాయవాదులు సంపూర్ణ ఆనంద్, గోవర్ధన్‌రెడ్డి, యాదవరెడ్డి, కమాల్‌రెడ్డి, బస్వరాజ్, మహమ్మద్ రఫి, శ్రీనివాస్‌రావు, శుక్లావర్ధన్‌రెడ్డి, నాగరాజు, శంకరయ్య, నారాయణ, బాలయ్య, అనిల్ కుమార్, వెంకటేశ్, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

- జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

వికారాబాద్, ఏప్రిల్ 25: దేవాదాయశాఖ భూములను అన్యాక్రాంతం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో గురువారం ల్యాండ్ రెవెన్యూ కమిషనర్ ఆదేశాల మేరకు దేవదాయ శాఖ భూముల అన్యాక్రాంతంపై రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ.. దేవాదాయ శాఖకు సంబంధించి సర్వే నెంబర్ల వారీగా భూముల వివరాలను అందించాలన్నారు. ధరణి పోర్టులో గల వివరాలతో సరి చూడాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. దేవాదాయ శాఖ భూములు అన్యాకాంతం కాకుండా రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసే భూములను పరిరక్షించాలన్నారు. ఈ సమీక్షలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శేఖర్, ఇన్‌స్పెక్టర్ మధుబాబు, తాండూర్, వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం డీఏవో మునీరుద్దీన్, గోవిందమ్మ, ఎం-సెక్షన్ సూపరింటెండెంట్ శివ శ్రీనివాస్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న రజిన్ చోప్రా

అక్రమ డబ్బు రవాణాకు అడ్డుకట్ట వేయాలి

యాలాల, ఏప్రిల్ 25: ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా డబ్బు రవాణా జర గకుండా అడ్డుకట్ట వేయాలని రాష్ట్ర ఎన్నికల వ్యయం (ఖర్చుల) అధికారి రజిన్ చోప్రా అన్నారు. ఆయన గురువారం ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును సందర్శించారు. అనంతరం రజిన్ చోప్రా మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల సందర్భంగా డబ్బులు రవాణా చేసే అవకాశం ఉందన్నారు. అలా జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఆర్డీవో శ్రీనివాసరావు, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, తహసీల్దార్లు మునీరొద్దీన్, తారాసింగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా నాభిశిల ప్రతిష్ఠాపనోత్సవాలు

షాబాద్, ఏప్రిల్ 25 : మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామంలో గురువారం ఘనంగా నాభిశిల ప్రతిష్ఠాపనోత్సవాలు జరిగాయి. ఉత్సవాల రెండోరోజు శ్రీ గణపతి, ఆవాహిత దేవి దేవతాపూజ, మహాస్నపనవిధి, మంటప ఆహహిత దేవాత హోమాలు, మన్యుసూక్తసహిత రుద్రహోమం, మహాస్నపనవిధి దాన్యాధివాసాంగ ఫలపుష్పాదివాస శయ్యాదివాసం మహోత్సవాలు తదితర కార్యక్రమాలను మంత్రోచ్చరణల మధ్య వేదపండితులు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోకుల లింగం, గ్రామస్థులు దయాకర్‌చారి, పెంటారెడ్డి, బాలకృష్ణారెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మచ్చలేని మనిషి కొండాను గెలిపించాలి

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి

ధారూరు, ఏప్రిల్ 25: రాజకీయ జీవితంలో మచ్చలేని మనిషిగా పేరున్న బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఓటర్లను కోరారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని తెలిపారు. గ్రామాల్లో మరుగుదొడ్లు, ఉచిత రేషన్ బియ్యం, సిమెంట్ రోడ్లు, ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు తదితర పథకాలు పేదలకు అందించామని చెప్పారు. హామీలు నెరవేర్చే సత్తా కాంగ్రెస్ పార్టీకి లేదని, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని ఆపార్టీ క్యాడరే ఇష్టపడటం లేదన్నారు. అలాంటి వారికి టికెట్ ఇచ్చారని ఆయన విమర్శించారు. ఈ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే బీజేపీకి ఓటు వేసి విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.రమేశ్, పాండుగౌడ్, రాజేందర్ గౌడ్, రాజు నాయక్, కృష్ణ, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి

యాలాల: మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందుతోందని ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అన్నారు. చెన్నారం, దౌలాపూర్ గ్రామాల్లో గురువారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాలాల మండల అధ్యక్షుడు యాదగిరి, మాజీ సర్పంచ్ శివకుమార్, సుదర్శన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కాశీనాథ్ పాల్గొన్నారు.



రాజీవ్ గృహకల్పలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ప్రజలు బీజేపీ బ్రహ్మరథం పడుతున్నారు

వికారాబాద్: ప్రజల్లోకి వెళితే ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, జిల్లా నాయకుడు రాజేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రాజీవ్‌గృహకల్పలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలుకూరులో బీజేపీ నాయకుల ప్రచారం

మొయినాబాద్, ఏప్రిల్ 25 : చిలుకూరులో గురువారం బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేర్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మోదీ చేపట్టిన కార్యక్రమాలు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ ఓట్లు అడిగారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మోర నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలి: నర్సింహారెడ్డి

కందుకూరు : కేంద్రంలో బీజేపీకి మరోసారి అవకాశం ఇవ్వాలని, చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి కోరారు. గురువారం ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ మంద జ్యోతితో కలిసి మండలంలోని దెబ్బడగూడ గ్రామంలో ఉపాధి పనుల వద్ద ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం మరింత పురోగతి చెందడానికి ప్రధాని నరేంద్రమోదీ పెద్దపీట వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల శాఖ ప్రధాన కార్యదర్శి నిమ్మ అంజిరెడ్డి, జిల్లా నాయకులు బొక్క సత్యనారాయణరెడ్డి, మంద పాండు తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరంలో..

మహేశ్వరం : ప్రధాని నరేంద్రమోదీ ప్రతిష్ఠాత్మకంగా అమలు పరిచిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించడంలో కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగారంలో పార్టీ మండలాధ్యక్షుడు ఎస్. మాధవాచారి అధ్యక్షతన బీజేపీ మండల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ అనేక అభివృద్ధి పనులను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుంటే వాటన్నింటిని తామే చేస్తున్నామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ వచ్చిందన్నారు. అదే తరహాలోనే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తున్నదన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌శర్మ, పాపయ్యగౌడ్, అందెల శ్రీరాములుయాదవ్, మిద్దెసుదర్శన్‌రెడ్డి, కె. జంగయ్యయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యం

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 25 : లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్లలో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు గున్నాల గోపాల్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఓబీసీ కన్వీనర్ ఎల్గని వెంకటేష్‌గౌడ్, బీజేపీ మండలాధ్యక్షుడు మదుసూదన్‌రెడ్డిలు కోరారు. చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా గురువారం మండల పరిధిలోని మోత్కుపల్లి, చందానగర్, వీరన్నపేట, చిలుకూరు గ్రామాల్లో పర్యటించి ఇంటింటికి తిరిగి బీజేపీకి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఎన్నో ఏళ్లు కాంగ్రెస్ పార్టీ దేశాన్ని పాలించిందని కానీ చేసిందేమి లేదని అదే మోదీ ప్రభుత్వం 10 సంవత్సరాల్లో ఎంతో అభివృద్ధి చేసిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సహదేవ్ గౌడ్, ఓబీసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు రాజమల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన నేతలు

చేవెళ్ల, ఏప్రిల్ 25 : పార్లమెంట్‌లో చేవెళ్ల ప్రజల గొంతు వినిపించాలంటే అన్ని వర్గాల ఓటర్లు బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి కోరారు. గురువారం రాత్రి చేవెళ్ల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని బీఆర్ఎస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యలతో కలిసి ఆమె పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తు చేసి బిఆర్ఎస్‌కు ఓట్లు వేసేవిధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రులందరు అహంకర దోరణిలో మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఓడించాలన్నారు.



చేవెళ్లలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సబితారెడ్డి, కాసాని జ్ఞానేశ్వర్

అంతకు ముందు కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ జెండాను ఎగరవేయాన్నారు. పార్లమెంట్‌లో చేవెళ్ల ప్రజల తరఫున గొంతును వినిపిస్తానన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల, పరిగి ఇన్‌చార్జీలు రాంబాబు, గట్టు రాంచందర్ రావు, డీసిఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైఎస్ ఎంపీపీ. శివప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్, జడ్పీటీసీ శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ బాల్‌రాజ్, నాయకులు, కార్యర్తలు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనే లక్ష్యం

- డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.ధరణికుమార్

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 25 : మలేరియా నివారణే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు తమ వంతుగా కృషి చేసినప్పుడే ఆ వ్యాధిని నిర్మూలించవచ్చని ఇబ్రహీంపట్నం డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.ధరణికుమార్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం ఇబ్రహీంపట్నంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగునీరు ఎక్కడా నిల్వకుండా అందరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే దోమలను నివారించవచ్చన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. ర్యాలీలో డా.మమత, డా.శ్రీకీర్తన, సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి, హేంలాల్, చంద్రశేఖర్, వయోలా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హస్తం.. పేదల నేస్తం..

- బీజేపీని గెలిపిస్తే కొరివితో తలగోక్కున్నట్టే
- కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 25 : కాంగ్రెస్ హస్తం.. పేదల నేస్తమని కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా గురువారం ఆయన రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మతాల మధ్య చిచ్చుపెట్టి బీజేపీ చోద్యం చూస్తోందని గుర్తు చేశారు. ఆ పార్టీకి ఓటేస్తే కొరివితో తలగోక్కున్నట్టేనని చెప్పారు. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే రెండు, మూడు అమలవుతున్నాయని, కాంగ్రెస్ అధిష్ఠానం, సీఎం రేవంత్‌రెడ్డి, ఆరు గ్యారెంటీలను సంపూర్ణంగా అమలు చేసేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియగానే నూరు పాళ్లు అమలు చేసి చూపుతామని చెప్పారు. కేంద్రంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీజేపీ దేశానికి, తెలంగాణకు, ప్రత్యేకంగా చేవెళ్లకు చేసిందేమీ లేదన్నారు. కేంద్రం తెచ్చిన జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుతో సామాన్యుల జీవితాలు దుర్భరంగా మారాయని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పేదలు బతకలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగం విలయతాండవం చేస్తున్నదన్నారు. ఈ సమస్యలేవీ బీజేపీకి పట్టటం లేదని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, విదేశాల్లోని నల్లధనాన్ని వెనక్కు రప్పించి ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామన్న ప్రధాని మోదీ తన హామీలను నిలబెట్టుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఏఏ, ఎన్ఆర్‌సీ లాంటి చట్టాలతో మైనారిటీలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డికి ఓటేస్తే నిండా మునుగుడేనని హెచ్చరించారు. చేవెళ్ల అభివృద్ధి కావాలన్నా, మత సామరస్యంతో ప్రజలు ఆనందంగా ఉండాలన్నా కాంగ్రెస్‌కే ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. చెయ్యి గుర్తుకు ఓటేసి చేవెళ్ల ఎంపీగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి బీజేపీ, బీఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే... పేదలకు సరైన న్యాయం జరుగనున్నట్లు చెప్పారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే, శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్ గౌడ్, సీనియర్ నాయకులు ఫహీమ్ తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న చేవేళ్ల కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి

కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

షాబాద్ : చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా గడ్డం రంజిత్‌రెడ్డి నామినేషన్‌కు గురువారం పార్టీ షాబాద్ మండల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ హయాంలోనే దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, తెలంగాణ నుంచి ఎంపీగా అధిక స్థానాలు గెలిపించుకుని రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు చంద్రయ్య, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

భీంభరత్ ఆధ్వర్యంలో..

చేవెళ్ల :రంజిత్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి చేవెళ్ల నుంచి ఆ పార్టీ నాయకులు గురువారం భారీగా తరలి వెళ్లారు. కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్, నవాబ్‌పేట్ తదితర మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి భారీగా నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక వాహనాల్లో రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించుకోవాలన్నారు.

రంజిత్‌రెడ్డి గెలుపునకు సమిష్టి కృషి

కందుకూరు, ఏప్రిల్ 25 : లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. గురువారం ఆ పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్న రంజిత్‌రెడ్డికి మండలం నుంచి భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు. అనంతరం రంజీత్‌రెడ్డి నామినేషన్ కోసం రాజేంద్రనగర్‌కు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాణాప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు

రంజిత్‌రెడ్డి నామినేషన్‌కు తరలిన నాయకులు

నవాబుపేట: చేవేళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజీత్‌రెడ్డి గురువారం నామినేషన్ వేయడంతో నవాబుపేట మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎత్రజ్‌పల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు తాండూరులో ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

తాండూరురూరల్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాల్లో శుక్రవారం(నేడు) మల్కాపూర్, కరన్‌కోట్ గ్రామాల్లో ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పర్యటిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు(శుక్రవారం) ఉదయకం 10 గంటలకు మల్కాపూర్, సాయంత్రం 5.30గంటలకు కరన్‌కోట్ గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారని చెప్పారు.


పచ్చ చీర కట్టుకుని.. వైఎస్ శత్రువు ఇంటికి వెళ్లారు

- బురద చల్లేందుకు ఇద్దరు చెల్లెళ్లను
- ఎవరు పంపించారో మీకు తెలుసు
- వీళ్లా వైఎస్ఆర్ వారసులు?: జగన్
- షర్మిల, సునీతపై పరోక్ష విమర్శలు
- వైఎస్ అవినాశ్ చిన్నపిల్లాడని వ్యాఖ్య

కడప, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): "వైఎస్ ఎవరితో పోరాడారో, అలాంటి శత్రువుల ఇంటికి పసుపు చీర కట్టుకుని వెళ్లారు. వారి స్క్రిప్ట్‌లను మక్కీకి మక్కీ చదివి వినిపిస్తూ, వారి కుట్రలో భాగమవుతున్నారు. వీళ్లా వైఎస్సార్ వారసులు? వైఎస్ విగ్రహాలు గ్రామంలో ఉండకూడదని చెప్పిన వారితో చెట్టాపట్టాలేసుకున్నారు" అని ఏపీ సీఎం జగన్ తన చెల్లెళ్లు షర్మిల, సునీతను పరోక్షంగా విమర్శించారు. నామినేషన్ వేసేందుకు గురువారం తాడేపల్లి నుంచి పులివెందులకు చేరుకున్న ఆయన.. అక్కడ బహిరంగ సభలో మాట్లాడారు. "జగన్ అధికారంలోకి వచ్చాక మమ్మల్ని పక్కనబెట్టాడని మాట్లాడుతున్న నా బంధువులకు తెలియజేస్తున్నా"నంటూ షర్మిల, సునీత పేర్లను ప్రస్తావించకుండా నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. షర్మిల తన కుమారుడి పెళ్లి శుభలేఖ ఇవ్వడానికి చంద్రబాబు ఇంటికి వెళ్లిన సందర్భాన్ని ప్రజలకు గుర్తుచేశారు. 'అవినాశ్ ఏ తప్పూ చేయలేదని బలంగా నమ్మాను కాబట్టే అతడికి టికెట్ ఇచ్చాను. మా అందరి కన్నా చిన్నపిల్లాడు అవినాశ్. ఆ పిల్లాడి జీవితం నాశనం చేయాలని పెద్దపెద్దవాళ్లంతా కుట్రలు చేస్తున్నారు. వివేకా హత్య కేసు విషయంలో అవినాశ్ అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేని వీరంతా ఈ చిన్నపిల్లాడిని దూషించడం, తెరమరుగు చేయాలనుకోవడం దారుణం. అసలు వీరందరూ మనుషులేనా?" అన్నారు. "బురద చల్లేందుకు ఇద్దరు చెల్లెమ్మలను ఎవరు పంపించారో, వారి వెనకాల ఎవరున్నారో మీకు తెలుసు" అని ప్రజలనుద్దేశించి అన్నారు.

సభ్యత, సంస్కారం ఉన్నాయా?

- నేను కట్టుకున్న చీర గురించి మగవాళ్ల ముందు మాట్లాడతావా?
- జగన్‌పై షర్మిలారెడ్డి ఫైర్



గుంటూరు/విజయవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): 'సీఎం స్థాయిలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభ పెట్టి.. వేల మంది మగవాళ్లు ఉంటే.. నేను కట్టుకున్న చీర గురించి మాట్లాడాడు' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ధ్వజమెత్తారు. మాట్లాడుతున్నది సొంత చెల్లెలి గురించి అన్న ఇంగితం కూడా లేకుండా తన వంటిపై ఉన్న బట్టల గురించి ప్రస్తావించారంటే ఎంత దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారో ఆలోచించాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం గుంటూరు, విజయవాడల్లో జరిగిన ప్రచార సభల్లో ఆమె ప్రసంగించారు. పులివెందులలో తనపై జగన్ చేసిన వ్యాఖ్యలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'నేను పసుపు చీర కట్టుకొన్నానని అవహేళనగా మాట్లాడారు. ఏం.. పసుపు చీర కట్టుకోకూడదా? చంద్రబాబు ఏమైనా పసుపు రంగు కొన్నారా? జగన్ ఒక విషయాన్ని మరిచిపోయినట్లున్నారు. జగన్ పత్రికలో పసుపు రంగు ఉంటుంది. దానికి వైఎస్ ఆనాడు చెప్పిన మాట.. పసుపు అంటే మంగళకరమైన రంగు. అది టీడీపీది కాదని పెట్టించారు' అని తెలిపారు. సొంత చెల్లి చీర గురించి మాట్లాడుతున్న వీరికి సభ్యత, సంస్కారం ఉన్నాయా అని విరుచుకుపడ్డారు. ఇంకా ఆమె ఏమన్నారంటే..

దేవుడు మీకు ఇంగితం ఇవ్వలేదా?

సీఎం జగన్ ఈ రోజున పులివెందుల సభలో వివేకానందరెడ్డి ప్రస్తావన చేశారు. ఆయన గురించి ఒక్క మంచి మాట కూడా నోటి వెంట రాలేదు. వివేకానందరెడ్డికి రెండో పెళ్లి అయిందట. ఇంకో సంతానం ఉందట! అంతేతప్ప.. వివేకానందరెడ్డి ఒక ప్రజానాయకుడని గానీ.. ఎవరైనా సమస్యతో వస్తే ఉత్త చేతులతో పంపడని గానీ.. రాజశేఖర్‌రెడ్డి తమ్ముడని గానీ... ఆఖరి నిమిషం వరకు వైసీపీ కోసమే పని చేశారని గానీ ఒక్క మాటయినా జగన్ నోట్లో నుంచి రాలేదంటే ఎంత ఆశ్చర్యం! అవినాశ్‌రెడ్డి అమాయకుడు, చిన్నవాడంట! ఆయన భవిష్యత్‌ను మేం నాశనం చేస్తున్నామని జగన్ మాట్లాడుతున్నారు. అతడి భవిష్యత్‌ను పాడు చేసేవాళ్లమే అయితే మీరు ఎంపీగా నిలబెట్టినప్పుడు.. వివేకా వద్దు వద్దని చెప్పినా మేమెవరం కాదనలేదే! వివేకాను చంపిన రోజునే అవినాశ్ చంపాడని చెప్పలేదే! అవినాశ్ మంచివాడని నమ్ముతున్నాను.. అందుకే ఎంపీ టికెట్ ఇచ్చానని జగన్ అంటున్నారు. ఎందుకు గుడ్డిగా నమ్ముతున్నారు? మీకు దేవుడు ఇంగితం ఇవ్వలేదా? మీకు ఆలోచించే శక్తి లేదా? సీబీఐ అన్ని ఆధారాలు చూపిస్తోంది కదా! చంపించిన వారు, చంపినవారి గూగుల్ టేక్ అవుట్ మ్యాచ్ అవుతున్నాయి. లావాదేవీలు జరిగాయి. అడ్వాన్స్‌లు తీసుకున్నారని సీబీఐ చెబుతున్నా ఎందుకు అవినాశ్‌ను ఇంకా నమ్ముతున్నారు? అన్నీ తెలిసి కూడా కాపాడుతున్నారంటే మీకు ఏమి అవసరం ఉందో చెప్పాలి. అవినాశ్‌ను నిందితుడిగా సీబీఐ చేర్చినా ఎందుకు కాపాడారు.. మళ్లీ ఎందుకు టికెట్ ఇచ్చారో చెప్పాలి.


వివేకా హత్యపై లైవ్ డిబేట్‌కు సిద్ధం

- మీ చానల్‌కే వస్తా.. మీరు సిద్ధమా?
- సీఎం జగన్‌కు డాక్టర్ సునీత సవాల్
- గాయానికి బ్యాండ్ తీయాలని సలహా
- లేకుంటే చీము పడుతుందని హెచ్చరిక

పులివెందుల రూరల్, ఏప్రిల్ 25: "వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు అవినాశ్‌రెడ్డి నిర్దోషి అని మీరు అంటున్నారు. ఇక ఏ వ్యవస్థపై మీకు నమ్మకముంది సార్?" అని ఏపీ సీఎం జగన్‌ను ఆయన చెల్లెలు, వివేకా కుమార్తె డాక్టరు సునీత సూటిగా ప్రశ్నించారు. పులివెందుల సభలో అవినాశ్‌రెడ్డిని జగన్ చిన్నపిల్లాడుగా సంబోధించడంపై సునీత స్పందించారు. చిన్నపిల్లాడైతే స్కూలుకు పంపించాలన్నారు. పులివెందులలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. "ఎంపీ అంటే బాధ్యత.. పిల్లలకు టికెట్టు ఇవ్వరు. నిందితులను మూడోసారి ఎంపీగా పోటీ చేయిస్తున్నారు. సీబీఐ నిందితులుగా తేల్చిన వారిని మీరు ప్రోత్సహిస్తున్నారు. దయచేసి ఇలా చేయకండి" అని కోరారు. "మీకోసం వివేకా ఎన్నో త్యాగాలు చేశారు. కానీ మీరేం చేశారు? ఆయన గురించి మంచిగా ఒక్కమాట కూడా మాట్లాడరు. ఆయన హత్యపై మీ చానల్‌లో లైవ్ డిబేట్ ఏర్పాటు చేయండి. నేను సిద్ధం. మీరు సిద్ధమా..?" అని జగన్‌కు సవాల్ విసిరారు. అలాగే.. గులకరాయి ఘటన జరిగినప్పటి నుంచీ తలకు బ్యాండేజ్ వేసుకుని తిరుగుతున్న జగన్‌కు ఆమె డాక్టర్‌గా ఓ సలహా ఇచ్చారు. దెబ్బతగిలిన చోట బ్యాండ్ ఎయిడ్ పెట్టుకుంటే లోపల చీము పట్టి, సెప్టిక్ అయ్యే చాన్స్ ఉందని హెచ్చరించారు. బ్యాండ్ ఎయిడ్ తీసేస్తే గాయం త్వరగా మానిపోతుందని తెలిపారు.

జగన్.. నీకిది తగునా?

- నీ సొంత మీడియాలోనే మీ చిన్నాన్న వ్యక్తిత్వ హననమా?
- సీఎం జగన్‌కు వివేకా సతీమణి సౌభాగ్యమ్మ లేఖ



పులివెందుల, ఏప్రిల్ 25: "నిన్ను సీఎంగా చూడాలని తపించిన మీ చిన్నాన్న వ్యక్తిత్వాన్ని మీ పత్రికల్లో, టీవీల్లో, సోషల్ మీడియాలో హననం చేయడం తగునా? న్యాయం కోసం పోరాడుతున్న నీ చెల్లి సునీత.. ఆమెకు మద్దతు ఇస్తున్న షర్మిలపై నిందలు మోపుతుంటే.. కుటుంబ సభ్యునిగా కాకపోయినా.. ముఖ్యమంత్రిగా అయినా ఇదేనా నీ కర్తవ్యం?" అని సీఎం జగన్‌ను వివేకా భార్య వైఎస్ సౌభాగ్యమ్మ ప్రశ్నించారు. ఈ మేరకు ఆమె సీఎంకు రాసిన బహిరంగ లేఖను గురువారం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. "2009లో తండ్రి చనిపోయినపుడు నువ్వు ఎంత వేదనను అనుభవించావో 2019లో నీ చెల్లి సునీత కూడా అంతే వేదన అనుభవించింది. అప్పటినుంచి జరిగిన పరిణామాల్లో మమ్మల్ని ఎక్కువ బాధించిన విషయం.. మన కుటుంబంలోని వారే ఈ హత్యకు కారకులు కావడం... వాళ్లకు నువ్వు రక్షణగా ఉండటం. నిన్ను సీఎంగా చూడాలని తపించిన చిన్నాన్నపై మీ సొంత మీడియా, పార్టీ వర్గాలు తీవ్ర విమర్శలు చేశాయి. మాటల్లో చెప్పలేనంత విధంగా వ్యక్తిత్వ హననం చేయడం, చేయించడం నీకు తగునా? న్యాయం కోసం పోరాటం చేస్తున్న నీ చెల్లెలు సునీతను హేళన చేస్తూ, నిందలు మోపుతూ, దాడులకు కూడా తెగబడే స్థాయికి కొంత మంది దిగజారుతుంటే నీకు ఏమాత్రం పట్టడం లేదా? సునీతకు మద్దతుగా నిలిచి పోరాడుతున్న షర్మిలను కూడా టార్గెట్ చేస్తుంటే నువ్వు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం ఏమిటి? కుటుంబ సభ్యునిగా కాకపోయినా రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఇదేనా నీ కర్తవ్యం? ఇంకా బాధించే విషయం.. హత్యకు కారకులైన వారికి మళ్లీ పోటీ చేసే అవకాశాన్ని నువ్వు కల్పించడం. ఇది సముచితమా? ఇటువంటి చర్యలు నీకు ఏమాత్రం మంచిది కాదు. హత్యకు కారకుడైన నిందితుడు నామినేషన్ దాఖలు చేశాడు. చివరి ప్రయత్నంగా న్యాయం, ధర్మం గురించి ఆలోచించమని నిన్ను అర్థిస్తున్నా. రాగద్వేషాలకు అతీతంగా పరిపాలన చేస్తానని ప్రమాణం చేసిన ముఖ్యమంత్రిగా న్యాయం, ధర్మం, నిజంవైపు నిలబడమని వేడుకుంటున్నా" అని సౌభాగ్యమ్మ తన లేఖలో పేర్కొన్నారు.

గొంతు తడపాల్సిన నీరు నేలపాలు


వీయూపీ వద్ద సర్వీసు రోడ్డు పక్కన పైప్‌లైన్ లీకేజీ

ఘట్‌కేసర్, ఏప్రిల్ 25: వేసవిలో ప్రజల గొంతు తడపాల్సిన నీరు నేలపాలవుతోంది. ఎదులాబాద్ రోడ్డులోని భూగర్భ వంతెన వద్ద గల సర్వీసు రోడ్డు పక్కన పైప్‌లైన్ పగిలి ఐదు రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. రోడ్డుపక్కనే చెరువుగా మారినా మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వందల కిలోమీటర్ల దూరం నుంచి ప్రజల దాహార్తిని తీర్చడానికి తరలిస్తున్న తాగునీరు మధ్యలోనే వృథాఅవుతోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పైప్‌లైన్లను మరమ్మతు చేయించి తాగునీటి ఇబ్బందులు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు ఉపాధ్యాయుడి ఎంపిక


శాంత్‌కుమార్

దోమ, ఏప్రిల్ 25: దాదాపూర్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఆవుటి శాంత్‌కుమార్ రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికయ్యారు. 2024 జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరిలో రాష్ట్ర విద్య పరిశోధక మండలి సైన్స్ ఎడ్యుకేషన్ రైసింగ్ భారత్ అనే అంశంపై ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, పరిశోధకులను సెమినార్ పత్రాలను పంపాల్సిందిగా ఆహ్వానించినట్లు ఏప్రిల్ 25, 26 తేదిల్లో సెమినార్ పత్రాలను ఆన్‌లైన్‌లో ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర సెమినార్‌కు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాజేశ్వరమ్మ

దోమ, ఏప్రిల్ 25: మండలంలోని పాలెపల్లిలో గురువారం జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ విజయగోపాల్‌గౌడ్, గ్రామస్థులు తిరుపతయ్య, నర్సింహులు, లింగయ్య, యం.నర్సిములు, మణికంఠ పాల్గొన్నారు.

రాబోవు కాలమంతా 'ఏఐ'దే

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 25: రావోవు కాలమంతా ఆర్టిఫిషయల్ ఇంటలిజెన్స్'ఏఐ'దేనని గూగుల్ సీనియర్ సొల్యూషన్స్ ప్రతినిధి మానస తెలిపారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో గురువారం అధునాతన కంప్యూటింగ్ ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ఆర్టిఫిషయల్ ఇంటలిజెన్స్‌లో ఉద్యోగావకాశాలు ఎక్కువగా లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ మల్లికార్జున్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ మనోరంజన్‌దాస్, అర్చన, రాజేశ్వర్, అర్జున్, విద్యార్థులు పాల్గొన్నారు.

వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలి

కొడంగల్/కొడంగల్ రూరల్, ఏప్రిల్ 25: మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యూసుఫ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తదితరులు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కొడంగల్ మండలంలోని ఉడిమేశ్వరం, ఎరన్‌పల్లి, పోచమ్మ, మైసమ్మ తండాల్లో, చిట్లపల్లి, సంగాయిపల్లి, లక్ష్మీపల్లి, అంగడిరైచూర్, ధర్మాపూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌రెడ్డి, నయీమ్, దాము తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. కొత్తూర్, ఏనమీదితండా తదితర గ్రామాల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బొంరాస్‌పేట్ మండలం నుంచి 20 వేల మెజారిటీని అందించాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాపాలన

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 25: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రంలో ప్రజాపాలన సాధ్యమని జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ప్రతాప్‌సింగారంలో గురువారం ఎదులాబాద్ మాజీ ఉపసర్పంచ్ అకిటి సుధాకర్‌రెడ్డి 50మంది అనుచరులతో కందుల కుమార్, బింగి రాజేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో జడ్పీచైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరివర్ధన్‌రెడ్డి, మహేష్‌గౌడ్, రవి, రమేష్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

కీసర: టీఆర్ఎస్ పార్టీ నుండి భారీగా సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి అధ్వర్యంలో గురువారం మండల కేంద్రం కీసర గ్రామానికి చెందిన టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దాదాపు 200 మంది కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

బొంరాస్‌పేట్: దుద్యాల మండలంలోని పోలెపల్లి ఆలయ కమిటీ మాజీ చైర్మన్, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణరెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. గురువారం హైదరాబాద్‌లో మండల నాయకులు ఆవుటి శేఖర్, మెరుగు వెంకటయ్య, సీతారామ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డికి ప్రధాన అనుచరుడిగా ఉన్న రామకృష్ణరెడ్డి నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బీఆర్ఎస్‌లో చేరారు.

మాదిగలపై సీఎం కపట ప్రేమ

తాండూరురూరల్, ఏప్రిల్ 25 సీఎం రేవంత్‌రెడ్డిది మాదిగలపై ఉన్నది కపట ప్రేమ అని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ అన్నారు.తాండూరు పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాదిగ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీల్లో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఒక్కసీటు కూడా ఇవ్వకుండా మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వకుండా రాజకీయంగా అణచివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు డీఏవీ విద్యార్థుల ఎంపిక

తాండూరు రూరల్, ఏప్రిల్ 25: మండల పరిధి లోని కరన్‌కోట్ సీసీఐలోని డీఏవీ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం దర్శవీర్ సింగ్ తెలిపారు. పాత శాలివాహన కళాశాల మైదానంలో ఇటీవల జరిగిన అండర్-14 విభాగం 400, 600 మీటర్ల పరుగు పందెంలో డీఏవీ పాఠశాలకు చెందిన దుర్గేష్, అరుణ్‌చౌహాన్, మంజీత్, అండర్-16 విభాగంలో ఇర్ఫత్, అరుణ్ సందేష్‌గౌడ్, మనీష్, గాయత్రిలు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం తెలిపారు. ఈనెల 28వ తేదీన సూర్యాపేట జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

నిబంధనలు పాటిస్తూ విధులు నిర్వహించాలి

» ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాజీవ్ చబ్రా



ఆర్డీవో కార్యాలయ సందర్శనలో రాజీవ్ చబ్రా

వికారాబాద్, ఏప్రిల్ 25: ఎన్నికల నిబంధనల మేరకు అధికారులు విధులు నిర్వహించాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాజీవ్ చబ్రా తెలిపారు. వికారాబాద్ ఆర్డీవో కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన చేవెళ్ల పార్లమెంటరీ ఎన్నికలకు సంబంధించి వికారాబాద్ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పార్లమెంటరీ ఎన్నికల సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించేందుకు వీలుగా చేపట్టిన ఏర్పాట్లను చూసి సంతృప్తి వ్యక్తంచేశారు. అభ్యర్థులు వెచ్చిస్తున్న ఖర్చుల వివరాలు నమోదు చేయాలని ఆయన సూచించారు. నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో చేపడుతున్న వివిధ అంశాలపై అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ వ్యయ పరిశీలకులకు వివరించారు. ఎన్నికల వ్యయ పరిశీలకుల సందర్శనలో జిల్లా పరిషత్ సీఈవో సుధీర్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బు, మద్యం సరిహద్దులు దాటొద్దు

తాండూరురూరల్: పార్లమెంటు ఎన్నికలు కట్టుదిట్టమైన భద్రత మధ్య పూర్తిచేయాలని పార్లమెంటు ఎన్నికల పరిశీలకులు రాజీవ్ చబ్రా ఆదేశించారు.ఆయన తాండూరు నియోజకవర్గ పరిధిలో గురువారం ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులను ఆయన సందర్శించారు. తాండూరు మండల పరిధిలోని కొత్లాపూర్ చెక్‌పోస్టు, యాలాల, మండలం లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో చెక్‌పోస్టులను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ తారాసింగ్, తాండూరు రూరల్ సీఐ అశోక్, కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి, ఎన్నికల సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉద్యోగ అన్వేషణ మాని ఆంత్రప్రెన్యూర్లుగా మారాలి


మాట్లాడుతున్న ఐడీఎస్ అదనపు కార్యదర్శి ఏవీ రావు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 25: చదువులు పూర్తి చేసి పట్టాలు పొందిన వెంటనే విద్యార్థులు ఉద్యోగ అన్వేషణలో పడుతారని అలాంటి వారు ఆంత్రప్రెన్యూర్లుగా మారి ఉన్నతస్థాయికి చేరాలని ఐడీఎస్ అదనపు కార్యదర్శి ఏవీ రావు విద్యార్థులకు సూచించారు. గుండ్లపోచంపల్లి మైసమ్మగూడ మల్లా రెడ్డి యూనివర్సిటీలో నిర్వహించిన 'ఎకనామిక్ ఇంపాక్ట్ ఆఫ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ఇన్ హైప్రొటెన్షియల్ డెవలప్‌మెంట్ ఎకనామిక్స్' అనే అంశంపై గురువారం నిర్వహించిన అంతర్జాతీయ సెమినార్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వ్యాపార వాణిజ్య పరమైన చదువులపై పూర్తి అవగాహన కలిగి నాడే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఉద్యోగాలు చేయటం కన్న నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి రావాలన్నారు. యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ బీఎస్‌కే రెడ్డి మాట్లాడుతూ.. ఆంత్రప్రెన్యూర్లుగా మారటానికి ప్రస్తుతం చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆంజనేయులు, బీబీఏ హెచ్ఓడీ విద్యాసాగర్, ఎంబీఏ హెచ్ఓడీ నిర్మల్ దయానంద్ రాజు, స్కాలర్లు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతతో మానవాళికి ముప్పు

» జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్


తండావాసులతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్

ధారూరు, ఏప్రిల్ 25: అడవులు ప్రజల సంపదని, చెట్ల నరికివేతతోట భవిష్యత్తులో మానవాళికి ముప్పు వాటిల్లుతుందని జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. ధారూరు అటవీరేంజ్ పరిధిలోని సంగాయపల్లి, బాణాలపూర్ అటవీ ప్రాంతంలో అటవీ భూములను ఆక్రమించుకుంటున్నారని అందిన ఫిర్యాదులతో సంగాయపల్లి రిజర్వు ఫారెస్టును తనిఖీ చేసిన అనంతరం తండా వాసులతో సమావేశమై అవగాహన కల్పించారు. అడవుల్లో చెట్లను నరికి అడవిని అక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఇన్‌చార్జి రేంజర్ ఆరుణ, సెక్షన్ అధికారి మోయినొద్దీన్, బీట్ అధికారి అనంద్‌లు ఉన్నారు. కాగా అవగహన సమావేశంలో సెక్షన్ అధికారి మోయినొద్దిన్ అవినీతిపై సంగాయపల్లి తండా వాసులు డీఎఫ్‌వోకు పిర్యాదు చేశారు. అటవీ భూమిని ఆక్రమించుకున్నారని, పంటలు వేశారని బెదిరించి తమ వద్ద వేలాది రూపాయల డబ్బులను సెక్షన్ అధికారి వసూలు చేశాడని ఆరోపించారు. గొర్రె, మేకపోతులను తీసుకెళ్లాడని తండావాసులు డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్‌కు వివరించారు. తండావాసులంతా మూకుమ్మడిగా సెక్షన్ అధికారి అవినీతిపై ఫిర్యాదు చేయటంతో డీఎఫ్‌వో అవాక్కచి విస్మయానికి గురయ్యారు. దీంతో సెక్షన్ అధికారి మొయినొద్దీన్‌పై డీఎఫ్‌వో ఆగ్రహం వ్యక్తం చేశారు. సెక్షన్ అధికారిపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపిస్తామని, వాస్తవమని తేలితే ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌వో తండావాసులకు హామీ ఇచ్చారు. కాగా సెక్షన్ అధికారి మొయినొద్దీన్ అడవిలో నుంచి పెద్దఎత్తున మొరం, ఇసుకను తరలించి ధారూరులో నిల్వ చేశాడనే ఫిర్యాదులు అందాయని, దీనిపై విచారణ చేపడతామని డీఎఫ్‌వో చెప్పారు.

ఓటర్ స్లిప్పులు ఇంటింటికీ పంపిణీ చేయాలి


బషీరాబాద్: నాయకులతో మట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేష్

తాండూరు, ఏప్రిల్ 25: ఎన్నికల సంఘం ముద్రించిన వీఐఎస్ (ఓటరు ఇన్‌ఫర్మేషన్ స్లిప్పులు)ను ఇంటింటికి తీసుకెళ్లి ఓటర్లకు పంపిణీ చేయాలని ఆర్డీవో శ్రీనివాస రావు తెలిపారు. జూన్ 4వరకు ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు ఆర్డీవో శ్రీనివాస రావు తెలిపారు. తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో రెండులక్షల 43,192 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

బషీరాబాద్: తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్వోలకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ ఓటర్ల స్లిప్పుల పంపిణీకి సంబంధించి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాల వారీగా ఓటరు స్లిప్పులను వారికి అందజేశారు. అంతకు ముందు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండలస్థాయి వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటయ్య, ఆర్ఐ రాకేష్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు కలాల్ నర్సింహులుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, బీజేపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బసిరెడ్డిపల్లి వాసికి డాక్టరేట్

పరిగి, ఏప్రిల్ 25:బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన మదులపల్లి శ్రీశైలం డాక్టరేట్ వరించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో శ్రీశైలం చరిత్ర విభాగంలో ఇంటలేక్చువల్స్ అండ్ సపరేట్ తెలంగాణ రాష్ట్ర ఉద్యమం, ప్రొఫెసర్ జయశంకర్‌పై అధ్యయం చేశారు. విశ్వవిద్యాలయంలో చరిత్ర విభాగం ఆదిపతి డాక్టర్ ఎస్.అంజయ్య పర్యవేక్షణలో పరిశోధన చేసి నివేదికను సమర్పించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయంలో ఈ ఏడాదికి సంబంధించి పీహెచ్‌డీలను ప్రదానం చేసింది. అందులో శ్రీశైలం ఒకరు. ఈమేరకు విశ్వవిద్యాలయ అధిపతి చేతుల మీదుగా శ్రీశైలం పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిహెచ్‌డి పట్టారావడం సంతోషంగా ఉందని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో ఉన్నత లక్ష్యంకోసం కృషి చేస్తానని తెలిపారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

వికారాబాద్, ఏప్రిల్ 25 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ రైతుల తరపున డిమాండ్ చేశారు. వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ధన్నారం గ్రామ పొలాల్లోకి గురువారం వెళ్లి రైతులతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలుకాక రైతులు గోస పడుతున్నారని అన్నారు. మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్, రూ.2లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15వేల రైతుబంధు వెంటనే అమలు చేయాలని పోస్టుకార్డు ఉద్యమం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి రాసి పంపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు విజయ్‌కుమార్, రాంరెడ్డి, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పులుసుమామిడిలో హనుమాన్ విగ్రహప్రతిష్ఠాపనలో పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. అంతకు ముందు ధన్నారం సమీపంలో ఫ్యూచర్ జనరేషన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డీవీ నరేశ్‌రాజ్

కొడంగల్, ఏప్రిల్ 25: విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని రిటైర్డ్ హెచ్ఎం శీలాదేవి అన్నారు. కొడంగల్‌లోని నవీన ఆదర్శ హైస్కూల్‌లో గురువారం 26వ వార్షికోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నవీన అంటే కొత్తదనం, ఆదర్శ అంటే అందరికి ఆదర్శంగా నిలుస్తున్న పాఠశాల అన్నారు. పాఠశాల వ్యవస్థాపకుడు డి.వెంకటయ్య మాట్లాడుతూ 36 సంవత్సరాల అనుభవంలో ఎందరో విద్యార్థులను తీర్చి దిద్దుతున్న పాఠశాల నవీన ఆదర్శ అన్నారు. అనంతరం విద్యార్థులకు వార్షిక ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, నోటుబుక్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డీవీ.నరేశ్‌రాజ్, వైస్ ప్రిన్సిపల్ సంతోష, ఉపాధ్యాయులు అరుణ, నాగేంద్రమ్మ, అరుణ జ్యోతి, ఫాతిమా, సన, శకుంతల, మేహరాజ్, మహేందర్, సునిత, వేదవతి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 25: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట్ గ్రామానికి చెందిన మెహీన్(26) చికెన్‌షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం పనిమీద తన బైక్‌పై తూంకుంట నుంచి శామీర్‌పేట్ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో ఓఆర్ఆర్ సమీపం వద్ద ఎదురుగా కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు అతివేగంగా వస్తున్న లారస్ లాబ్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మెహీన్ కి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్ పట్టివేత

మోమిన్‌పేట్, ఏప్రిల్ 25: అక్రమంగా డీజిల్‌ను రవాణా చేస్తున్న ట్యాంకర్‌ను పోలీసులు పట్టుకున్నారు. కర్ణాటక నుంచి డీజిల్‌ను తరలిస్తుండగా మండలంలోని ఎన్కతల గ్రామ సమీపంలో స్థానిక పెట్రోల్ బంకు యజమాని, సిబ్బంది పట్టుకున్నారు. దాదాపు 2500లీటర్ల డీజిల్‌ను ట్యాంకర్‌లో తరలిస్తుండగా పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కొన్ని రోజులుగా కర్ణాటక నుంచి తెలంగాణలోని వికారాబాద్ ప్రాంతంలోని మరుపల్లి, మోమిన్‌పేట్, బంటారం తదితర గ్రామాల్లో డీజిల్ ట్యాంకర్ ద్వారా తక్కువ ధరకు అమ్ముతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరవింద్ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 25: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు. యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ నుంచి కొడంగల్ మీదుగా గురువారం ఇసుకను తరలిస్తుండగా కానిస్టేబుల్‌లు నరేందర్ రెడ్డి, సమీవుద్దీన్‌లు ట్రాక్టర్‌ను ఆపి ఇసుక తరలింపునకు అనుమతి పత్రాలు చూయించాలని అడిగారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండటంతో పట్టుకుని కొడంగల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ ఎండీ ఇమ్రాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లైంగిక దాడి కేసులో నిందితుడిపై పోక్సో కేసు

బషీరాబాద్, ఏప్రిల్ 25: బాలికపై లైంగిక దాడికి పాల్పడి గర్భవతిని చేసిన నిందితుడిపై బషీరాబాద్ పోలీసులు పోక్సోకేసు నమోదు చేశారు. వికారాబాద్ జిల్లా లీగల్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి నరేష్‌కుమార్ గురువారం తెలిపారు. మండలంలోని ఓ గ్రామంలో బాలికపై ఆదే గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ కర్రె నరేష్ లైంగిక దాడికి పాల్పడగా బాలిక గర్భం దాల్చింది. ఈక్రమంలో బాలిక తల్లిదండ్రులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. బాలిక కుటుంబ సభ్యులను కలిసి విచారించి అండగా ఉంటామని భరోసానిచ్చినట్లు తెలిపారు. ఈ విషయమై బషీరాబాద్ పోలీసులను కలిసి మట్లాడినట్లు జిల్లా లీగల్ చైల్డ్‌ప్రొటెక్షన్ అధికారి చెప్పారు. నింధితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసినట్లు జిల్లా లీగల్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి నరేష్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'తో వెల్లడించారు.

నీటి వృథాకు చెక్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


కుళాయికి బిగించిన ట్యాప్

బషీరాబాద్, ఏప్రిల్ 25: 'నీటి వృథా ఎవరికీ పట్టదా?' అనే శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బషీరాబాద్ ఎంపీడీవో రాఘవులు ఎంపీవో రమేష్‌తో చర్చించి వాస్తవ పరిస్థితిపై ఆరాతీశారు. ఎంపీడీవో ఆదేశాలతో ఎంపీవో సిబ్బందిని నవాల్గలోని మహేందర్‌రెడ్డి కాలనీకి ఉదయాన్నే పంపించి కుళాయికి బిరడా ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్‌రెడ్డికి మెమో జారీచేసి వివరణ కోరినట్లు ఎంపీడీవో వెల్లడించారు. ఇదిలా ఉండగా ఎక్కడైనా గ్రామాల్లో నీటి వృథా, లీకేజీలు ఉన్నట్లు తెలిస్తే ప్రత్యేకాఆధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేద్దాం


కులకచర్ల: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

మోమిన్‌పేట్, ఏప్రిల్ 25: మలేరియా నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేద్దామని మోమిన్‌పేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సుజల అన్నారు. అంతర్జాతీయ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి గురువారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.

కులకచర్ల: కులకచర్లలో గురువారం ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మానిటరింగ్ అధికారి చంద్రప్రకాశ్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను ప్రజలు పాటించాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు ప్రశాంతి, ఆరోగ్య సిబ్బంది యాదమ్మ, విజయలక్ష్మి, షాజాహన్, వెంకటమ్మ, రత్నమ్మ, సుజాత పాల్గొన్నారు.

జేఈఈలో గిరిజన విద్యార్థుల ప్రతిభ

పరిగి, ఏప్రిల్ 25: పరిగిలోని గిరిజన సంక్షేమ బాలికల కళాశాల నుంచి జేఈఈలో ప్రతిభను చాటారు. ఈ కళాశాల నుంచి 17మంది విద్యార్థులు ప్రతిభను చాటి జాతీయస్థాయి పరీక్షకు అర్హతను సాధించారు. వీరిలో పరిగి కళాశాల స్థాయిలో ముగ్గురు టాపర్లుగా బి.నవ్య(86,089), బి.శ్రీలక్ష్మి(82,699), వి.సంధ్య(79,678)లు నిలిచారు. వీరితో పాటు మరో 14మంది విద్యార్థులు ప్రతిభను కనబరిచి అర్హతను సాధించారు. వీరంతా ఐఐటీలో చదవడానికి జాతీయస్థాయిలో అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయనున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ వై.సుమతి గురువారం విద్యార్థులను అభినందించారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ


ఎన్నెపల్లిలో ఊరడమ్మకు బోనాలు ఊరేగింపు

దోమ, ఏప్రిల్ 25: ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మండలంలోని మైలారం గ్రామంలో పరమేశ్వర గణపతి ఆంజనేయ ధ్వజస్తంభ, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా గురువారం హనుమాన్ దేవాలయ ఆవరణలో హోమం నిర్వహించారు. ధ్వజ స్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ పురోహితులు తెలిపారు. పూజా కార్యక్రమాలకు భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

జినుగుర్తిలో కాటమయ్య జాతర


స్వామి వారిని దర్శించుకుంటున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తిలో గౌడ కులస్థుల ఆరాధ్య దైవం కాట మయ్య జాతర జరిగింది. కాటమయ్య ఆలయ 4వ వార్షికోత్సవం గురువారం గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు బోనాలతో తరలివచ్చి నైవేద్యం సమర్పించారు. కాటమయ్య స్వామిని ఎమ్మెల్యే సోదరుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డితోపాటు రవిగౌడ్, వడ్డె శ్రీను, శామ్యప్ప, అజ్మత్‌లు దర్శించుకున్నారు. వారికి నిర్వహకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, లాలయ్యగౌడ్, బాలప్పగౌడ్, ప్రవీణ్‌గౌడ్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

వైభవంగా సంగయ్యలొంక జాతర

వికారాబాద్, ఏప్రిల్ 25: మదన్‌పల్లి గ్రామశివారులో గల సంగయ్యలొంకలో వెలసిన పరమ శివుడి జాతర ఉత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేకపూజలు నిర్వహించి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

ఎన్నెపల్లిలో ఊరడమ్మ బోనాలు

వికారాబాద్: పట్టణంలోని ఎన్నెపల్లి హనుమాన్ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాల్లో ధ్వజస్తంభంతో ముగించారు. గురువారం గ్రామంలో బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని బొడ్రాయికి, ఊరడమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు వారి బంధువులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అనంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు

సంక్షిప్తంగా..

● **కులకచర్ల:** చౌడాపూర్ మండలంలోని అడవి వెంకటాపూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో గురువారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

● **కులకచర్ల:** మండల కేంద్రంలో పంచాయతీ ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని ప్రారంభించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం పక్కన ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీవో రామకృష్ణలు చలి వేంద్రాన్ని ప్రారంభించారు.

● **శామీర్‌పేట:** శామీర్‌పేటలో గురువారం విలేకరుల సమావేశంలో మేడ్చల్ కాంగ్రెస్ ఏబ్లాక్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్‌కు కార్యక్రమానికి హాజరైన కేటీఆర్ కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ పథకాలపై చేసిన ఆరోపణలను ఖండించారు.

● **వికారాబాద్:** 2023-24 సంవత్సరానికి గానూ తెలంగాణ ప్రభుత్వ ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఉద్యాన వననర్సరీ మామిడి చెట్ల ఫలసాయం బహిరంగ వేలం గురువారం ఉద్యానకేంద్రంలో నిర్వహించి నట్లు జరిగిందని జిల్లా అధికారి సత్తార్ తెలిపారు. ఇట్టి వేలంలో బాబు అనే వ్యక్తి 2.75లక్షలకు ఫలసాయం పొందే హక్కు పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ రామలక్ష్మి, కోఆర్డినేటర్ లక్ష్మణ్, అధికారులు అర్చన, కమల పాల్గొన్నారు.

● **కీసర రూరల్:** మల్కాజ్‌గిరి ఎంపీగా ఈటల రాజేందర్ గెలుపు ఖాయమని నాగారం మున్సిపల్ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు కౌకుంట్ల చంద్రారెడ్డి ధీమా వ్యక్తంచేశారు. గురువారం మున్సిపల్ పరిధి 20వ వార్డులో బీజేపీకి ఓటు వేసి ఈటల రాజేందర్‌ను మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

● **పరిగి:** తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, కమిషనర్ వెంకటయ్య తెలిపారు. మునిసిపల్ పరిధిలోని 10వ వార్డులో గల శ్రీనివాసనగర్‌లో నాలుగు రోజులు నిలిచిపోయిన నీటి సరఫరా పనులను గురువారం బాగు చేయించారు.

● **మేడ్చల్ టౌన్:** బీఆర్ఎస్ అభ్యర్థిని గెలుపించి అభివృద్ధికి పాటు పడాలని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రిదీపిక నర్సింహారెడ్డి కోరారు. మేడ్చల్‌లోని పలు వార్డుల్లో గురువారం బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

● **నవాబుపేట:** పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ నవాబుపేట మండల అధ్యక్షుడు నాగిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థికి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు మెజార్టీని అందిస్తామన్నారు.